
క్లుప్తంగా

కిరణ స్పర్శ



సూర్య కిరణాలు తాకిన దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని కొండపై ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలోని విగ్రహానికి ఆదివారం సూర్యకిరణాలు తాకాయి. ఉదయం 5.10 నిమిషాలకు సూర్య కిరణాలు తాకటంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై సూర్యకిరణాలను తిలకించారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం



కల్యాణం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని తుమ్మావీధిలో వెలసి లక్ష్మీనసింహస్వామి ఆలయంలో ఆదివారం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు టి.చంద్రశేఖరరావు, ఈవో మాధవిల ఆధ్వర్యంలో స్వామి ప్రాతఃకాల పూజలు, అష్టోత్తర శతనామాలతో అర్చనలు భక్తుల గోత్రనామాలతో చేశారు. సాయంత్రం అర్చకులు పెంట శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో లక్ష్మీదేవి, గోదాదేవి సమేత నరసింహస్వామి ఉత్సమూర్తులను మండపంపై ఉంచి సంప్రదాయంగా పూజలు నిర్వహించి, కల్యాణ వేడుకలు జరిపారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



హెచ్ఎం శ్రీరాములనాయుడును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

గార: గార జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–2000 మధ్య కాలంలో చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. దీనికి చదువుకున్న పాఠశాలే వేదికైంది. పదో తరగతి పూర్వ విద్యార్థులంతా ఈ సందర్భంగా ఒకరికొకరు పలకరించుకుంటు నాటి ముచ్చట్లను పంచుకున్నారు. అనంతరం తమకు విద్యనునేర్పిన స్కూల్ హెచ్ఎం గొర్లె శ్రీరాములనాయుడు తదితర గురువులను ఘనంగా సత్కరించి గౌరవించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, మార్పు లాలస తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న తురాయి పువ్వులు



తురాయిచెట్టు పువ్వులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీజనల్‌గా పూచే పువ్వులు అందరినీ ఆకర్షిస్తుంటాయి. వేసవి కాలంలో తురాయిచెట్టు పువ్వులు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. కుంకుమ వర్ణంలో ఉన్న ఈ పువ్వులు ఎంతదూరంలో ఉన్నా తలతిప్పుకునేలా చేస్తాయి. శ్రీకాకుళంలోని శాంతినగర్‌కాలనీ నుంచి రిమ్స్‌కి వెళ్లేదారిలో ఉన్న తురాయిచెట్లు పువ్వులతో అందగా కనిపిస్తున్నాయి.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ఇచ్ఛాపురం: ఎయిడ్స్‌పై అవగాహన అవసరమని స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ స్మారక దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధితో మృతిచెందిన వారికి సంతాపంగా స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో వైసీబీ ప్రివిన్సెన్ ట్రక్కర్ యూనియన్ స్వచ్ఛంద సంస్థ, సీహెచ్‌సీ వైద్య సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక సీహెచ్‌సీ నుంచి బస్టాండ్ కూడలి వరకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు కౌన్సిలింగ్ కూడా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ బమ్మిడి రాజశేఖర్, స్వచ్ఛంద సేవాసంస్థ సిబ్బంది వై.రవికుమార్, గున్న రవికుమార్, సీహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

● సామూహిక వ్రతాలు



వ్రతాలలో పాల్గొన్న భక్తులు

వైశాఖ శుద్ధ ఏకాదశి, అన్నవరం సత్యనారాయణ స్వామి కల్యాణాన్ని పురస్కరించుకొని పలు చోట్ల సత్యన్నారాయణ స్వామికి వ్రతాలు ఆదివారం నిర్వహించారు. శ్రీకాకుళంలోని సత్యసాయి సమితి పెద్దమందిరంలో 30 మంది దంపతులచే సామూహికంగా సామూహిక వ్రతాలు చేశారు. జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ పప్పల నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి నరసింహమూర్తి, మందిరం కన్వీనర్ కంబ మురళీకృష్ణ పాల్గొన్నారు. అలాగే చిం దత్తనాథ క్షేత్రంలో కూడా 108 మంది దంపతులచే సామూహిక వ్రతాల జరిగాయి. అర్చకులు బంకుపల్లి సింహాచల శర్మ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ సభ్యులు జి.గోవిందరావు, ట్రస్టు సభ్యులు, జయలక్ష్మీమాత మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

–శ్రీకాకుళం కల్చరల్



చిం దత్తనాథ క్షేత్రంలో సత్యన్నారాయణ వ్రతాలు



సత్యసాయి పెద్దమందిరంలో సత్యన్నారాయణ వ్రతాలు

● ఆలయ వార్షికోత్సవం



శ్రీకాకుళం నగరంలోని బలగ గ్రామదేవత భద్రమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ముర్రాటలు, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

–శ్రీకాకుళం కల్చరల్

● కాలభైరవస్వామికి పూజలు



బలగ నాగావళి తీరంలో వేంచేసిన బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఆదివారం స్వర్ణాకర్షణ కాల భైరవ స్వామికి అభిషేకాలు జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేషపూజలు, హారతులు నిర్వహించి అలంకరణ చేశారు. గోపూజా, నిత్య అన్నదాన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

మాతృ భాషపై పట్టు సాధించాలి



తెలుగు భాషపై అవగాహన కల్పిస్తున్న వక్తలు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు పాఠశాల స్థాయిలో శతక పద్యాలు సాధన చేయాలని రీసోర్స్‌పర్సన్ ఎం.జయరాం అన్నారు. ధర్మవరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం శతక పద్యాల ప్రాధాన్యత, నీతి, మాతృ భాషపై పట్టు వంటి అంశాలపై రీసోర్స్‌పర్సన్ విద్యార్థులకు వివరించారు. వేమన, సుమతి, కృష్ణ, దాశరధి తదితర కవులు రచించిన పద్యాలు చదవాలన్నారు. ఈ పద్యాల భావం తెలుసుకుంటే జీవితం విలువ తెలుస్తుందన్నారు. ప్రతీ పద్యంలో అనేక అంశాలతో కూడిన నీతి ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి మాతృ భాషపై పట్టు సాధించాలన్నారు. తెలుగు భాషపై పట్టు వస్తే ఇంగ్లిష్ సైతం వస్తుందని వివరించారు. గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలతో ఎంతో లాభం



మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు

ఎచ్చెర్ల: లావేరు శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఎన్నో విషయాలను నేర్చుకుంటున్నామని పదో తరగతి విద్యార్థి హేమంత్ కుమార్ ఆదివారం తెలిపారు. లావేరు శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరంలో హేమంత్ కుమార్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా వేసవి విజ్ఞాణ శిబిరాలకు తాను హాజరు అవుతున్నానని, ఎన్నో విషయాలను నేర్చుకుంటున్నానన్నారు. గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. గ్రంథాలయ సహా అధికారి పి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా తిరువీధి



మహనీయుల చిత్రపటాలతో తిరువీధి



శ్రీశంకరవిజయం పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉపనిషన్మందిరంలో జరుగుతున్న మహనీయుల ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఆదిశంకరాచార్యులు, భగవద్రామానులు, విద్యారణ్యుల చిత్రపటాలతో తిరువీధి నిర్వహించారు. పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు తిరిగి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం జరిగిన సభలో హైదరాబాద్‌కు చెందిన కర్రి భాస్కరరావు రచించిన శ్రీశంకర విజయం పుస్తకావిష్కరణను కె.అమ్మన్నాయుడు, మందిరం అధ్యక్షులు గుమ్మా నగేష్ చేశారు. పుస్తక పరిచయాన్ని పన్నాల రామకృష్ణ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వి.కామేశ్వరరావు, తెన్నేటి విక్రమశర్మ, ఎస్.నారాయణమూర్తి, నిష్ఠలనర్సింహమూర్తి, బి.కోమలరావు, పి.ఈశ్వరరావు, జి.విశ్వేశ్వరరావు, అప్పలకొండ, పివిఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా యూవీవీ వార్షికోత్సవం

పలాస: మండలంలోని నీలావతి గ్రామంలో ఉద్దానం విద్యాభివృద్ధి వేదిక 22వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. యూవీవీ అధ్యక్షుడు ఇసాకోటి జోగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాశీబుగ్గకు చెందిన ప్రముఖ వైద్యులు టి.బాలక్రిష్ణ, తెప్పల ఆనంద్, మట్ట ఖగేశ్వరరావు తదితరులు ప్రసంగిస్తూ యూవీవీ సేవలను కొనియాడారు. ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం చేస్తున్న సేవలు అమూల్యమన్నారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతానికి చెందిన ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు బర్రి కూర్మారావు, దుమ్ము శంకరరావు, సాహుకారి వల్లభరావు, లండ జగన్నాథం, పెద్దింటి శిఖిధరవర్మలకు ఘనంగా సన్మానం చేశారు. ఉద్దానం ప్రాంతంలో పదో తరగతి చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కుత్తుం ప్రకాశరావు, అధ్యక్షులుగా బొమ్మాళి శివ, ఉపాధ్యక్షులుగా పోతనపల్లి గీతమ్మ, ప్రధాన కార్యదర్శిగా గొరకల లోకేశ్వరరావు, కార్యదర్శిగా ఎంపల్లి కామేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా జినగ సీతారాంతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూవీవీ ప్రతినిధులు బొడ్డు చిన్నారావు, బి.ఓంకార్, టి.వాసుదేవరావు, కుత్తుం వినోద్, పోతనపల్లి బాలరాజు, తామాడ రామారావు పాల్గొన్నారు.

కేఆర్‌పేటలో గ్రామ దేవత ఉత్సవాలు ప్రారంభం

వజ్రపుకొత్తూరు: మండలంలోని కంబాలరాయుడుపేటలో ఆదివారం గ్రామ దేవత పెద్దమ్మతల్లి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక పాండురంగ సోదర సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, సర్పంచ్ వంక చిరంజీవి, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు వంక శివశంకర్ తెలిపారు. అమ్మవారికి చల్లదనం చేయడంతో పాటు గ్రామస్తులు, సేవా సంఘం ప్రతినిధుల సహకారంతో పాండురంగ స్వామి, రుక్మిణాంబల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్టు వివరించారు. పొరానికి ఘట్టాలతో గ్రామంలో సందడిగా నెలకొంది.

బ్రహ్మోత్సవాల్లో నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న జిల్లా కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం గోవిందరాజ స్వామి అఖండ బ్రహ్మోత్సవాలలో నగరానికి చెందిన సంధ్యశ్రీ ప్రతిక బృందం భరత నాట్య ప్రదర్శన చేశారు. ఉత్సవాలలో భాగంగా ముత్యాల పందిరి వాహన సేవలో ఈ నృత్య ప్రదర్శన చేసి నీరాజనం సమర్పించుకున్నారు.

పుచ్చలపల్లి ఆశయ సాధనకు కృషి



రణస్థలం: సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు



ఎచ్చెర్ల క్యాంపస్: నినాదాలు చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: భారత కమ్యూనిస్టు ఉద్యమ నేత, పార్లమెంట్ మొదటి ప్రతిపక్ష నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా సీఐటీయూ, సీపీఎం, కార్మిక వర్గాలు ఆదివారం నివాళులర్పించాయి. చిలకపాలెంలో, అరిణాంఅక్కివలసలోని శ్యాంక్రిగ్ ఫిస్టన్స్ పరిశ్రమ ఆవరణలో, నాగార్జున అగ్రికెం పరిశ్రమ ఆవరణలో సుందరయ్య చిత్రపటాలకు నివాళులర్పించారు. సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సీఐటీయూ నాయకులు పి.తేజేశ్వరరావు కోరారు. కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

సోషలిజంతోనే సమసమాజ స్థాపన

రణస్థలం: సోషలిజంతోనే సమసమాజం సాధ్యమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ తెలిపారు. శ్రమజీవుల హక్కులు, అణగారిన వర్గాల అభ్యున్నతి, ప్రజాస్వామ్యం కోసం నిరంతరం కృషి చేసిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా రణస్థలంలో సీఐటీయూ కార్యాలయం వద్ద సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. పార్లమెంట్‌లోనూ, అసెంబ్లీలోనూ ప్రజా సమస్యలు, దేశాభివృద్ధి, వివిధ అంశాలపై రాజకీయ ప్రత్యర్థులు సైతం ప్రశంసించే రీతిలో సుందరయ్య విస్తృత చర్చలు జరిపారన్నారు. సామాన్య రైతు కూలీలు, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించారన్నారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించి బలోపేతం చేశారని తెలిపారు. పార్లమెంట్‌కు మొదటి ప్రతిపక్ష నేతగా సైకిల్‌పై వెళ్లారన్నారు. సంపన్న కుటుంబంలో పుట్టిన సుందరయ్య తన వాటాగా వచ్చిన ఆస్తులను ఉద్యమాలకే ధార పోసిన ఉత్తమ కమ్యూనిస్టు నేత అని కొనియాడారు. వి.లక్ష్మి, మహాలక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్..ప్రజలు అవస్థలు!



ఆటోలు, ద్విచక్ర వాహనాలతో రద్దీగా మారిన అరసవల్లి రోడ్డు

శ్రీకాకుళం క్రైమ్: వైశాఖ మాసం రెండో ఆదివారం కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. దీంతో అరసవల్లివైపుగా పోయే మార్గంలో నాలుగు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ఎండ తీవ్రతతో జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లా కేంద్రం నుంచి అరసవల్లి మీదుగా శ్రీకూర్మం, కళింగపట్నం వెళ్లేందుకు.. అలాగే అటునుంచి జిల్లా కేంద్రానికి వచ్చేందుకు ఎంతో కీలకమైన అరసవల్లి మార్గంలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో వేలాది మంది భక్తులు వచ్చారు. వాస్తవానికి ప్రతీ ఆదివారం అరసవల్లి దేవాలయం వద్ద ఇద్దరు ట్రాఫిక్ పీసీలను, మిల్లు జంక్షన్ వద్ద ఒకరిని, పెద్ద వాహనాలను నియంత్రించేందుకు టోయింగ్ వెహికల్‌ను ట్రాఫిక్ నియంత్రణ కోసం అరసవల్లిలో ఉంచుతారు. కానీ ఈ ఆదివారం ఒక్కసారిగా వచ్చిన భక్తులతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్య దినాల్లో ఆలయ, ఇతర విభాగాల అధికారులు, ముఖ్యంగా పోలీసులతో సమన్వయం లేకపోవడం, భక్తులు అధిక సంఖ్యలో రావచ్చుననే ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతోనే ఈ ఇబ్బంది ఎదురైందని స్థానికులు అంటున్నారు. ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రసాదరావు స్టేషన్‌కు సంబంధించిన మరో ఆరుగురితో కలిసి సుమారు నాలుగు గంటలపాటు ట్రాఫిక్ నియంత్రించేందుకు నానా కష్టాలు పడ్డారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



సత్యనారాయణస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని అదపాక గ్రామంలో గల సత్యనారాయణ స్వామి ఆలయ 8వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ..



జి.సిగడాం: కోటిబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: మర్రివలస సర్పంచ్ విక్రం కోటిబాబును ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. కోటిబాబు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు.వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.



రణస్థలం: లంకరమణను పరామర్శిస్తున్న సాయికుమార్, నాయకులు

విశాఖ వెళ్లి..

రణస్థలం: మండలంలోని రావాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లంక రమణ విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార ఆదివారం విశాఖ వెళ్లి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, రణస్థలం ఎఫ్‌ఎస్‌సీఎస్ అధ్యక్షుడు కిల్లారి రమణ, కిల్లారి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ పిన్నింటి లక్ష్మణనాయుడు తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి హ్యాపీనెస్ కార్యక్రమం

శ్రీకాకుళం కల్చరల్:

ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు హ్యాపీనెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీచర్ నంబాళ్ల కల్పన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుదర్శన క్రియ ప్రక్రియలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రియ ద్వారా మనలో ఒత్తిడి, టెన్షన్, మైగ్రేన్, నిద్రలేమి తొలిగి ఎలాంటి సమస్యను అయినా ఎదుర్కొనే శక్తి వస్తుందని అన్నారు. ఐదు రోజులు నిర్వహించే ఈ కోర్సులో చేరాలనుకునే వారు 95056 77388 నంబర్‌ను సంప్రదించాలన్నారు.